క్లుప్తంగా

అనంతవరంలో పొలం పిలుస్తోంది



అనంతవరం(క్రోసూరు): అనంతవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం వ్యవసాయశాఖ నిర్వహించింది. మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ వరి పంటను సందర్శించారు. అనంతరం ఏర్పాటు గ్రామ సభలో మాట్లాడారు. ఈ–పంట నమోదుకు ఈ–కేవైసీ చేయించుకునేందుకు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు. కౌలు గుర్తింపు కార్డులు, పీఎం కిసాన్, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ తదితర విషయాలను రైతులకు వివరించారు. పొలం పిలుస్తోంది పర్యవేక్షణాధికారి మల్లికార్జునరావు, వెటర్నరీ అసిస్టెంట్ సాయి శ్రీ, వ్యవసాయ మార్కెటింగ్ అధికారిణి పద్మావతి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామయ్య , ఎంపీటీసీ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కోతులు స్వైర విహారం

నకరికల్లు: చేజర్ల గ్రామంలో కోతులు స్వైర విహారం చేశాయి. గురువారం గ్రామంలో సెంటర్‌లో కూర్చొని ఉన్న పలువురిపై ఒక్కసారిగా దాడి చేసి, పలువురిని గాయపరిచాయి. గ్రామానికి చెందిన పఠాన్ అహ్మద్, షేక్.దావూద్‌తో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం నరసరావుపేటకు వెళ్లారు. కొన్ని రోజులుగా కోతులు కోతులు గ్రామస్తులపై దాడులు చేస్తున్నాయి. అధికారులు సకాలంలో చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సెలవుపై వెళ్లిన తహసీల్దార్

ముప్పాళ్ళ: తహసీల్దార్ ఎం.భవానిశంకర్ వ్యక్తిగత కారణాల దృష్ట్యా గురువారం నుంచి నెల రోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఇటీవల జరిగిన బదిలీల ప్రక్రియలో భాగంగా ఆయన బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 2వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఎవరినీ నియమించలేదు.

బాలాత్రిపుర సుందరిగా మహాలక్ష్మి



బెల్లంకొండ: మండల కేంద్రంలోని మహాలక్ష్మీదేవి నిలయంలో దేవి శరన్నవరాత్రి సందర్భంగా గురువారం మొదటి రోజు అమ్మవారు బాలత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు పులుపుల వేంకట ఫణికుమార్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



క్రోసూరు: యూత్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తొమ్మిదవ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు ఒంగోలులోని శ్రీ హర్షిని జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ స్కేటింగ్ పోటీల్లో క్రోసూరులోని సెయింటాన్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్స్‌పాల్ సిస్టర్ మేరీరజిత గురువారం తెలిపారు. విద్యార్థులు మస్యం జ్ఞానేశ్వర్, ఆత్మకూరి నరేంద్ర, సుంకిశాల జాకిచాన్, సుంకిశాల జాహ్నవి, గంజిమాల శైల, కె.శాన్వి, మద్ది లలితాంబిక పలు విభాగాల్లో ప్రతిభ చాటారని వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన ఘటన పాకలపాడు చప్టా వద్ద గురువారం జరిగింది. సత్తెనపల్లి నుంచి ఆటో క్రోసూరు వెళుతుండగా రెంటపాళ్ల నుంచి ఆటో సత్తెనపల్లి వస్తోంది. రెండో ఆటోలు ఎదురెదురుగా పాకాలపాడు చప్టా వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురికి గాయాలు కాగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరిలో మేడారపల్లి కుమారి, నంబూరు గోవర్ధన్‌కు తీవ్రగాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. మిగిలినవారు స్వల్ప గాయాలు కావడంతో స్థానికంగా చికిత్స పొందుతున్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఈపూరు: మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రగాయాలై చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతిచెందాడు. సేకరించిన వివరాల మేరకు...పిడుగురాళ్ల మండలం జానపాడుకు చెందిన పిచ్చయ్య (46) గత మూడు సంవత్సరాలుగా ఇనిమెళ్ల గ్రామంలో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యా యి. చికిత్స నిమిత్తం నరసరావుపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

బియ్యంతో మమ!

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- ఇతర సరుకులను పంపిణీ చేయని ప్రభుత్వం
- ఆందోళనలో దారిద్ర్యరేఖకు దిగువనున్న పేదలు
- ప్రజాపంపిణీ వ్యవస్థను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



పట్టణంలోని ఎండీయూ వాహనం వద్ద బియ్యం కోసం ఉన్న పేదలు

సత్తెనపల్లి: 'తాము అధికారంలోకి వస్తే పేదలందరికీ నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తాం .. ధరల నియంత్రణ చేపడతాం' .. ఇదీ కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ. అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా బియ్యంతో పాటు మరో సరుకు పంపిణీ చేయడం లేదు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో..సర్కార్ కందిపప్పుకు కోత పెట్టింది. దీంతో రేషన్ కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలతో ఇంటింటికి వెళ్లి సరుకులను పంపిణీ చేసేవారు. ప్రతినెలా 5వ తేదీకి రేషన్ పంపిణీ ప్రక్రియ ముగిసేది. ఇప్పుడు పక్షం రోజులు పూర్తయినా రేషన్ పంపిణీ పూర్తికావడం లేదు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి టౌన్, రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 165 చౌక దుకాణాలు, వాటి పరిధిలో 91,637 బియ్యం కార్డులున్నాయి.

కొనగలమా!..తినగలమా..?

పెరిగిన ధరలతో కొనగలమా! తినగలమా! అనే మాట ప్రజల్లో వినిపిస్తోంది. నిత్యావసర ధరలపై నియంత్రణ లేదు. మార్కెట్‌లో దళారులదే రాజ్యమైంది. రైతుల పంటలకు గిట్టుబాటు ధర లేదు. కందిపప్పు సామాన్యులకు అందడం లేదు. ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తోంది. గత ప్రభుత్వం బియ్యం, చక్కెర, రాగి, జొన్నలు, కందిపప్పు, బెల్లం ఇతర సరుకులను పంపిణీ చేసింది. తద్వారా దారిద్ర్య రేఖకు దిగువనున్న నిరుపేద కార్డుదారులకు నెలకు సరిపడా సరుకులు దాదాపుగా అతి తక్కువ ధరకే ఇంటికి చేరేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. బియ్యంతో పాటుగా ఎప్పుడో ఒకసారి చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

వింటే గుండెల'ధర'

బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలోల్లెక్కన ధరలు చూస్తే.. కందిపప్పు రూ.173, చింతపండు రూ.140, ఎండుమిర్చి రూ.220, ఉల్లిగడ్డలు రూ.70, గోధుమపిండి రూ.30 నుంచి రూ.50, బియ్యం రూ.50నుంచి రూ.80, కోడి గుడ్డు ఒకటి రూ.6లు ఉంది. ఇవే కాదు పోపులు, దినుసులు, దనియాలు, పసుపు ధరలు 30 శాతం మేరకు పెరిగాయి. వీటికి తోడు కూరగాయల ధరలు ఘాటెక్కిస్తున్నాయి. ఆకు కూరల ధరలూ మండుతున్నాయి.

ఎండీయూ వాహనాలే దిక్కు

గత ప్రభుత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా 55 ఎండీయూ వాహనాలతో నిత్యావసర సరుకులను ఇంటింటికీ పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ వాహనాలు ఖర్చు తప్ప ప్రయోజనం లేదని ప్రకటనలు చేసింది. ఇటీవల వరదల సమయంలో ఆ వాహనాలే ఎంతో ఉపయోగకరంగా మారాయి. నియోజకవర్గంలో 165 చౌక దుకాణాలు ఉండగా 55 ఎండీయూ వాహనాలతో సరుకుల పంపిణీ చేపడుతున్నారు. అయితే ఇంటింటికీ పంపిణీ చేయకుండా ఒక్క సెంటర్‌లో వాహనం ఆపి, ఆ ప్రాంతంలో వారందరికీ బియ్యం పంపిణీ చేసి మమ అనిపిస్తున్నారు.

నియోజకవర్గ సమాచారం	
చౌక దుకాణాలు	: 165
రెగ్యులర్ చౌక దుకాణాలు	: 42
తాత్కాలిక చౌక దుకాణాలు	: 123
రేషన్ కార్డులు	: 91,637
ఎండీయూ వాహనాలు	: 55
పంపిణీ చేసే బియ్యం	: 1,269 టన్నులు

అభివృద్ధిలో ముందంజ

సత్తెనపల్లి డివిజనల్ అభివృద్ధి అధికారి రాజగోపాల్



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ రాజగోపాల్

సత్తెనపల్లి: ప్రజా ప్రతినిధుల సహకారంతో అధికారులు గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరించి, సత్తెనపల్లి రూరల్‌ను ముందంజలో ఉంచాలన్నారు. సత్తెనపల్లి డీఎల్‌డీఓ వై.రాజగోపాల్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సమావేశానికి ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బీ అధ్యక్షత వహించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 50 లక్షలకు సంబంధించి టైడ్ కింద రూ. 30 లక్షలు, అన్‌టైడ్ కింద రూ. 20 లక్షలు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. త్వరితగతిన యాక్షన్ ప్లాన్ తయారు చేసి మంజూరు తీసుకోవాలన్నారు. ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఎంపీడీవో జీవీ.సత్యనారాయణ, ఈవోపీఆర్డీ దయాసాగర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: న్యాయవాదులకు నష్టంతో పాటు హక్కులు హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే నూతన చట్టం ఉందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ అన్నారు. న్యాయవాదులు విధులు బహిష్కరించి పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదుల మనుగడే ప్రశ్నార్థకంగా మారే విధంగా చట్టాలు రూపొందించేలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్య క్షుడు పాటిబండ్ల రవి, కార్యదర్శి మన్నెం వెంకటేశ్వరావు, న్యాయవాదులు రాజవరపు శివనాగేశ్వరరావు, నాగూర్ బాబు, పూజల వెంకట కోటయ్య, కళ్ళం వీర భాస్కర్ రెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, చలువాది చిన్న సత్యనారాయణ ఉన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి



రాజుపాలెం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని పనులను అర్హులైన ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని 11 గ్రామాలలో ఉపాధి హామీ పనుల 2025–26 ఆర్థిక సంవత్సరానికి చేపట్టబోయే పనులను గ్రామ సభల్లో గురువారం వివరించారు. అంచులవారిపాలెం గ్రామంలో సర్పంచ్ రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన గ్రామ సభల్లో ఏపీవో పాల్గొని, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరి సూరమ్మనాగేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



అచ్చంపేట: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కరెన్సీ నోట్లు, నాణేల దండలతో అలంకరించారు.



క్రోసూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయిలో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



నకరికల్లు: చేజర్ల గ్రామంలో శ్రీకపోతేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు.



సత్తెనపల్లి: శ్రీబాలా త్రిపుర సుందరీగా వాసవీకన్యకాపరమేశ్వరి



సత్తెనపల్లి: వెంకటపతికాలనీలోని శ్రీలక్ష్మీ ప్రత్యంగిర అమ్మవార్ల పీఠంలో శ్రీబాలా త్రిపుర సుందరీ

అధికారులు లేరు.. అర్జీలు ఎవరికివ్వాలి



మాట్లాడుతున్న డీవీఎంసీ సభ్యుడు దాసు

క్రోసూరు: గ్రామ సభకు మండల అధికారులు హాజరు కాకపోతే సమస్యల అర్జీలు ఎవరికి ఇవ్వాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాడు దాసు ప్రశ్నించారు. గురువారం క్రోసూరు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ అధ్యక్షత వహించారు. సర్పంచ్ మల్లా చందమామ పాల్గొన్నారు. దాసు మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు హాజరుకాకపోవడంపై అధికారులు చిత్తశుద్ధిని నిలదీశారు. గ్రామసభకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు అర్జీ అందజేస్తానని దాసు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు షేక్ జమీలాగఫూర్, ఉప సర్పంచ్ షేక్ మస్తాన్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సెల్లార్ నిర్మాణదారుడికి నోటీస్‌లు

సాక్షి ఎఫెక్ట్

సత్తెనపల్లి: పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో శ్రీనివాస్ మహల్ పక్కన అనధికారికంగా సెల్లార్ నిర్మాణం కొరకు ఎటువంటి భద్రత చర్యలు పాటించకుండా భూమిని తవ్వుతున్నట్లుగా గుర్తించి, భవన నిర్మాణదారుడికి నోటీసు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి గురువారం తెలిపారు. ఈ నెల 2న సాక్షి దిన పత్రికలో అక్రమాలకు 'ప్లానింగ్' శీర్షికతో ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆ విధంగా నిర్మాణం చేయడం వల్ల స్థలంలోని మట్టి జారిపోయి పక్కన ఉన్న భవనాలు, రహదారి కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. పనులను వెంటనే నిలుపుదల చేయాలని నోటీసులిచ్చారు. మూడు రోజుల్లో భద్రతా చర్యలు పాటించి, కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశించామన్నారు. అలా చేయకపోతే విధమైన నోటీసులు లేకుండా నిర్మాణ పనులు నిలిపేస్తామని పేర్కొన్నారు. చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కె.సునీత ఉన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు అందరూ సహకరించాలి



స్వచ్ఛతా హి సేవ ర్యాలీలో డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్

నరసరావుపేట రూరల్: పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే గ్రామంలోని వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల ఎస్టీ కాలనీలో గురువారం నిర్వహించిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో బాలునాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్య సిబ్బందిని సత్కరించారు. కాలనీలోని రోడ్ల వెంట ఉన్న వ్యర్థాలను తొలగించారు. పరిశుభ్రతపై జరిగిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ పల్నాడుగా మన జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలనికోరారు. చెత్తను, వ్యర్థాలను రోడ్లు వెంట వేయకుండా పారిశుద్య సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెవి ప్రసాద్, ఏపీఎం భరత్, గంగుల పెద్దిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముంచిన నకిలీ విత్తనాలు

నాదెండ్ల: నకిలీ విత్తనాల కారణంగా ఓ రైతు మోసపోయిన సంఘటన చందవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. జి.శ్రీనివాసరెడ్డి ప్రతి ఏటా స్వీట్‌కార్న్ సాగు చేస్తుంటాడు. ఈ ఏడాది 1.75 ఎకరాల్లో సాగు చేశాడు. విత్తనాలను గుంటూరు రాజాగారితోటలోని ఓ దుకాణంలో మిధాస్ కంపెనీ విత్తనాలు కొనుగోలు చేసిన సాగుచేశాడు. 70 రోజులు గడిచినా కండె సైజు రాకపోవటం, కొన్ని కండెలు విత్తనాలు లేకుండా పల్చగా ఉండటం గమనించాడు. తాను 1.75 ఎకరాల్లో పంట సాగుకు రూ.2 లక్షలు ఖర్చు చేశానని, నకిలీ విత్తనాల కారణంగా మోసపోయానని వాపోతున్నాడు. వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

మున్సిపల్ డీఈకి సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో డీఈగా విధులు నిర్వహిస్తున్న బి.మధుసూదన్‌రావు సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. గురువారం ఆయన రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ చాంబర్‌లో పూలమాలలు, దుశ్శాలువాలు, శ్రీ వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ సాంబశివరావు అందించి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దరువూరి నాగేశ్వరావు, మున్సిపల్ ఏఈ సాగర్ ఉన్నారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

పెదకూరపాడు: 75 త్యాళ్లూరులో శ్రీ కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఉదయం కలశ స్థాపనతో దసరా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అన్నపూర్ణాదేవిని బాలాత్రిపురసుందరి దేవిగా అలంకరించి పూజించారు. రాత్రికి అమ్మవారికి శ్రీలలిత సహస్ర నామాలతో కుంకుమార్చన నిర్వహిస్తారు. శ్రీ శివసాయి ట్రస్టు సభ్యులు పర్యవేక్షించారు.

నార్నెపాడులో ప్రత్యేక పూజలు



ముప్పాళ్ళ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని పలు ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నార్నెపాడులోని శ్రీగంగా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీబాలత్రిపురసుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ప్రకృతి వ్యవసాయ శిక్షకుడితో సిబ్బంది

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా వరి పంట పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు టి. సైదయ్య హాజరై ప్రస్తుత వాతావరణం పరిస్థితుల్లో వరి పొలాల్లో అగ్గి తెగులు నివారణకు పలు సూచనలు చేశారు. కిచెన్ గార్డెన్ వేసుకోవాలని దాని ద్వారా వచ్చే ఆహారం తినడం ద్వారా అనారోగ్య సమస్యల నుండి బయటపడవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమానికి వీఏఏ అమల, జయలక్ష్మి, మణికంఠ, చందాని, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

బెల్లంకొండ: పత్తిపంటలో గులాబీ, లద్దెపురుగుల నివారణకు రైతులకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.కృష్ణయ్య తెలిపారు. గురువారం మండలంలోని చంద్రారాజుపాలెం, కందిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన శాఖ అధికారి మోహన్, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, పశువైద్య అధికారి రామకృష్ణారెడ్డి, మార్కెటింగ్ అధికారి నవీన్, నాయకులు పాల్గొన్నారు.

దమ్మాలపాడులో..

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు, తురకపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం జరిగింది. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని పత్తిలో గులాబి రంగు పురుగుపై అవగాహన కల్పించారు. పశుసంవర్ధకశాఖ అధికారి జాన్ అహ్మద్ జీవాలలో, పశువుల్లో వచ్చే వ్యాధుల గురించి వివరించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఏడుకొండలు, మల్లవరపు చంద్రశేఖర్ ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో పొలం పిలుస్తోంది

రాజుపాలెం: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వెంకటనర్సయ్య రైతులకు తెగుళ్ల నివరాణను వివరించారు. పశువర్ధక శాఖాధికారి డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ పశువుల సంరక్షణ లేగదూడల పెంపకం, గర్భసమస్యల గురించి రైతులకు వివరించారు. మాజీ సర్పంచ్ సఖినాల వలిరాజు పాల్గొన్నారు.

రెండు రోజులు పాస్‌లు ఇవ్వలేం

చిలకలూరిపేటటౌన్: ఆర్టీసీ ప్రతినెలా విద్యార్థులకు అందించే రాయితీ బస్‌పాస్‌లు మంజూరు నిలుపుదల చేసినట్లు చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో బస్‌పాస్‌లు ఆధునీకరణ ప్రక్రియలో కొన్ని సాంకేతిక సమస్యలు నెలకొన్నాయన్నారు. కావున ప్రతినెలా క్రమం తప్పకుండా డిపో ప్రాంగణంలో ఇచ్చే స్టూడెంట్ బస్‌పాస్‌లను ఈనెల 5,6వ తేదీల్లో ఇవ్వడం సాధ్యం కావడం లేదని తెలిపారు. నియోజకవర్గంలోని నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల్లోని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు అసౌకర్యాన్ని అర్థం చేసుకోవాలన్నారు.